సాక్షి ప్రకాశం
సోమవారం। 16। జూన్। 2025



బిట్రగుంట చెరువులో పచ్చదొంగలు

బిట్రగుంట చెరువులో తుమ్మచెట్లు అక్రమంగా కొట్టి తెలుగు తమ్ముళ్లు అమ్ముకుంటున్నారు.
- 8లో..



ఘోర రోడ్డు ప్రమాదం

వైపాలెం మండలం అనకుంట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 28 మంది కూలీలకు గాయాలయ్యాయి.
- 8లో..

గరిష్టం/కనిష్టం
36 /29

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

18న కార్గో పార్శిల్లో వేలంపాట

ఒంగోలు టౌన్: ఆర్టీసీ పార్శిల్ సర్వీసులో 6 నెలలకు ముందు నుంచి ఉన్న అన్ క్లెయిమ్డ్ పార్శిళ్లను ఈ నెల 18వ తేదీ వేలం పాట వేయనున్నట్లు ఏటీఎం కమర్షియల్ జి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒంగోలులోని కార్గో విభాగంలో నిర్వహించే ఈ వేలం పాటలో ఆసక్తి కలిగినవారు పాల్గొనాలని కోరారు. వేలంలో వెంటనే నగదు చెల్లించిన వారికి వస్తువులను అప్పగిస్తారని తెలిపారు.

నేటి నుంచి నరవాడకు ఆర్టీసీ బస్సులు: అమ్మవారి జాతరను పురస్కరించుకొని నరవాడకు నేటి నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు తెలిపారు. ఒంగోలు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు ఈ బస్సు సర్వీసులను వినియోగించుకొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నీట్‌లో మెరిసిన గిరిజన విద్యార్థులు



తరుణ్‌కుమార్ నాయక్



సంతోష్ నాయక్

యర్రగొండపాలెం: నీట్ యూజీ-2025లో యర్రగొండపాలెం ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో వైద్య విద్య ప్రవేశాల కోసం గతనెల 4వ తేదీ నిర్వహించిన నీట్ యూజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో పుల్లలచెరువు మండలంలోని పాతచెరువు తండాకు చెందిన రామావత్ తరుణ్‌కుమార్ నాయక్ 51వ ర్యాంక్, వై.పాలెం మండలంలోని పాలుట్లకు చెందిన జండవత్ సంతోష్ నాయక్ 504 ర్యాంక్ సాధించారు. వీరిని ఆయా తండాలకు చెందిన గిరిజన నాయకులు అభినందించారు.

అన్నదాత దుఃఖీభవ!



సింగరాయకొండ రైతు సేవా కేంద్రం

పెట్టుబడిసాయం అందించక.. ఉచిత పంటల బీమా దూరం చేసి..గిట్టుబాటు ధరలూ కల్పించక రైతులను అన్ని విధాలా నష్టపరిచిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో అడ్డగోలు నిబంధనలతో మరోమారు వంచిస్తోంది. గతంలో నిశ్చింతగా రైతుభరోసా అందుకున్న లబ్ధిదారుల్లో భారీగా కోతపెట్టింది. ప్రభుత్వ నిర్వాకంతో లక్షల మంది రైతులు పథకానికి దూరమవుతున్నారు. పథకం ఇస్తామంటూనే ఈ విధంగా లేనిపోని ఆంక్షలు విధించటమేందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులకు భారీగా కోత
- జిల్లాలో మొత్తం రైతుల సంఖ్య 5,31,369
- అన్నదాత సుఖీభవ పథకం అర్హులుగా ప్రాథమికంగా 4,38,251 మంది నిర్ధారణ
- కోతల అనంతరం మిగిలింది 2,51,571 మంది
- జిల్లాలో 1,86,680 మంది రైతులకు పథకం ప్రశ్నార్థకం
- సవరణలతో కొంతమందికి పథకం అందిస్తామంటున్న ప్రభుత్వం
- పథకం వస్తుందా రాదా అన్న ఆందోళనలో రైతాంగం

సింగరాయకొండ: జిల్లాలో ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తామన్న కూటమి ప్రభుత్వం ఒక సంవత్సరం కాలయాపన చేసి తీరా రెండో సంవత్సరం వచ్చే సరికి పథకం అమలు చేస్తామని ప్రకటిస్తూనే సవాలక్ష ఆంక్షలు పెడుతోంది. ఈ పథకం అమలుకు సంబంధించి కూటమి ప్రభుత్వ పెద్దలకు...అధికారుల మాటలకు పొంతనలేకుండా ఉండటంతో చివరికి ఈ పథకం ఎవరికి వస్తుందో...ఎవరికి రాదో అర్థం కాకుండా రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 1,86,680 మంది రైతులకు పలు కారణాలతో ఈ పథకం అందకుండా కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ప్రభుత్వం పై వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనతో మళ్లీ అనర్హుల జాబితాలో సవరణలకు అవకాశమిస్తామని, మేం సూచించిన ప్రకారం సవరణలు చేసుకున్న వారికి మళ్లీ పథకం వర్తింపజేస్తామని ప్రభుత్వం నమ్మబలుకుతోంది. అయితే అసలు జాబితాలో తొలగించటం దేనికి, మళ్లీ చేర్చటం ఎందుకని రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలే: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని పంటలకు లాభాలను చవిచూసిన రైతులు కూటమి ప్రభుత్వ పెద్దల మాటలు నమ్మి అధికారం కట్టబెట్టిన నాటి నుంచి వారికి కష్టాలు ప్రారంభమయ్యాయి. రైతు భరోసా పథకం పేరు మార్చి అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి మొదటి సంవత్సరం ఎగనామం పెట్టడంతోనే రైతుల కష్టాలు ప్రారంభమయ్యాయి. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం రాలేదు. తరువాత పంటలు పండించినప్పటికీ ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర కల్పించటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మిర్చి, వరి, శనగ, మినుము, కంది, పెసర, పొగాకు, బొప్పాయి, మామిడి ఇలా ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేక రైతు అల్లాడుతున్నాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకుకు కేజీ ధర రూ.380 ఉంటే ప్రస్తుతం కేజీ రూ.180 ఉంది. మిర్చి ధర గతంలో క్వింటా రూ.23 వేలు ఉంటే ప్రస్తుతం రూ.13 వేలు ఉంది. వరి క్వింటా రూ.1,800 ఉంటే ప్రస్తుతం రూ.1,300 మాత్రమే ఉంది. బొప్పాయి క్వింటా రూ.18 వేలు ఉంటే ప్రస్తుతం రూ.6 వేలు మాత్రమే ఉంది. ఇక మామిడి రైతులు ఎగుమతులు లేక, తెగుళ్ల కారణంగా అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో పథకానికి లబ్ధిదారుల్లో భారీగా కోతలు: కూటమి ప్రభుత్వంలో తీవ్ర కష్టాలు, నష్టాలతో అల్లాడుతున్న రైతాంగానికి ప్రభుత్వం ఎట్టకేలకు ఈనెల 20వ తేదీ అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేస్తానని చెప్పటంతో వారి ఆనందానికి అంతులేదు. కానీ ప్రభుత్వం లబ్ధిదారుల జాబితా విడుదల చేసిన తరువాత వారి ఆనందం ఆవిరైపోయింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద జిల్లాలో 3,78,544 మందికి పథకం వర్తింపజేయగా కూటమి ప్రభుత్వం కేవలం 2,51,571 మందిని అర్హులుగా ప్రకటించింది. వాస్తవానికి అధికార లెక్కల ప్రకారం ప్రభుత్వ వెబ్‌ల్యాండ్‌లో 5,31,369 మంది రైతులు ఉండగా వారిలో పథకానికి అర్హులుగా 4,38,251 మందిని నిర్ధారించారు. కానీ రాష్ట్ర కమిషనరేట్ నుంచి ఆర్‌టీజీఎస్ ద్వారా మరింత కోత విధించి కేవలం 2,51,571 మందిని మాత్రమే అర్హులుగా ప్రకటించింది. మిగిలిన 1,86,680 లో ఎవరైనా అర్హులు ఉంటే వారిని నిర్ధారించాలని వారికి ఇస్తామని, తప్పుల సవరణకు ఆన్‌లైన్‌లో త్వరలో అవకాశం ఇస్తామని చెబుతున్నా రైతాంగంలో మాత్రం ఇక ఈ పథకం వచ్చేది అనుమానమేనన్న భావన వ్యక్తమవుతోంది.

పథకం అమలులో అన్నీ ఆంక్షలే

భార్యభర్తలు ఇద్దరికి పొలం ఉంటే ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఇన్‌కంటాక్స్ కడుతున్నా, ప్రభుత్వ పెన్షన్ రూ.10 వేల పైన వస్తున్నా, ప్రభుత్వ ఉద్యోగి అయినా, బ్యాంకు పాసు పుస్తకం, ఫోన్ నంబరు, ఆధార్‌కార్డుకు అనుసంధానం కాకుండా ఈకేవైసీ లేకుండా ఉన్నా, ఎస్సీలకు చెందిన అసైన్‌మెంట్ భూములు, ఇతరుల అసైన్‌మెంటు భూములు కొనుగోలు చేసినా, అంతేకాక పట్టాదారు పాసుపుస్తకంలో లబ్ధిదారు పేరుకు, ఆధార్‌కార్డులో పేరుకు తేడా ఉన్నా పథకం వర్తించదని, అయితే త్వరలో సవరణలకు అవకాశమిస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం వస్తుందని ఆనంద పడిన రైతాంగానికి కూటమి ప్రభుత్వం విధించిన ఆంక్షలతో ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. పథకం ఇస్తూ ఈ విధంగా లేనిపోని ఆంక్షలు విధించటమేందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

42 వేల మందికి తొలివిడత అనుమానమే

కూటమి ప్రభుత్వం అనర్హులుగా గుర్తించిన రైతుల్లో 42 వేల మంది ఆధార్ సీడింగ్‌లో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలకు పంపించింది. కానీ ప్రస్తుతం ఉన్న పని ఒత్తిడిలో వాటిని సరిచేయటం సాధ్యం కాదని రెవెన్యూ యంత్రాంగం చేతులెత్తేయటంతో మొదటి విడత అన్నదాత సుఖీభవ వీరికి అనుమానమేనని, రెండవ విడత వచ్చే అవకాశం ఉందని అధికారులే చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీనివాస ప్రసాద్‌కు వరల్డ్ ఇన్‌ఫ్లుయన్సర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పులి శ్రీనివాస ప్రసాద్

కంభం: గత 32 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కంభం పట్టణానికి చెందిన డాక్టర్ పులిశ్రీనివాస ప్రసాద్‌కు జాతీయ సాక్షరత సమితి వారు వరల్డ్ ఇన్‌ఫ్లుయన్సర్ అవార్డును ప్రదానం చేశారు. కలకత్తాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యజిత్ భట్టాచార్య, భారత చిత్ర నిర్మాణ సంస్థ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సవ్యసాచి చేతుల మీదుగా ఆయనకు అవార్డుతో పాటు ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి అందించే అవార్డు తనకు రావడం సంతోషంగా ఉందని అవార్డు గ్రహీత తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. పలువురు ప్రముఖులు అవార్డు గ్రహీతను అభినందించారు.

అప్పీల్‌కు వెళ్లే ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలి

ఒంగోలు టౌన్: బదిలీ కౌన్సెలింగ్‌పై అప్పీల్ చేసుకునే ఉపాధ్యాయులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలపై ఏవైనా ఫిర్యాదులుంటే ముందుగా జిల్లా కమిటీకి, జిల్లా విద్యాశాఖ అధికారికి అప్పీల్ చేసుకోవాలన్నారు. ఒకవేళ జిల్లా విద్యాశాఖ అధికారి మీద అప్పీల్ చేసుకోవాలనుకుంటే రీజనల్ కమిటీకి అంటే రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీల్ చేసుకోవాలనుకుంటే సేట్ లెవెల్ కమిటీకి చెందిన పాఠశాల విద్యా కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. చట్టపరమైన పరిష్కారాల కోసం వెళ్లే ఉపాధ్యాయులు అన్నీ స్థాయిల అప్పీల్ నిబంధనలను పాటించాలని, లేకపోతే ఏపీసీఎస్ రూల్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

వైభవంగా నారసింహునికి అభిషేకం



స్టీలు డ్రమ్ములో స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం



నారసింహునికి అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

సింగరాయకొండ: పురాణప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ముఖ్య ఘట్టమైన నారసింహునికి అభిషేకం, చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నారసింహుడు, భూదేవి, శ్రీదేవి ఉత్సవమూర్తులకు అభిషేకం, చివరగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణ-పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం ఆలయంలో లక్ష్మీ సంవాద ఉత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈఓ పీ కృష్ణవేణి వివరించారు.


చక్రస్నాన కార్యక్రమంపై భక్తుల అసంతృప్తి: స్వామి వారికి చక్రస్నానం కార్యక్రమం కొండ కింద ఉన్న భవనాశిలో కాకుండా స్టీలు డ్రమ్ములో నిర్వహించటంపై భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో అయినా భవనాశి పరిరక్షణకు ఆలయ అధికారులు కృషి చేయకపోవటం బాధాకరమన్నారు. భవనాశిలో చక్రస్నానం చేసి ఉంటే స్వామితో పాటు తాము కూడా మునిగే వారమని చివరకు డ్రమ్ములో స్వామికి చక్రస్నానం చేయించిన తరువాత ఆ నీటిని చల్లించుకుని తృప్తి పడాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసిద్ధి చెందిన ఆలయంలో కూడా అధికారులు ఈ విధంగా చేయటమేంటని భక్తులు అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరశింహాచార్యులు, ఉదయగిరి లక్ష్మీ నరశింహాచార్యులు, ఉదయగిరి వెంకట సుదర్శనాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, భక్తులు పాల్గొన్నారు.

గ్రామకంఠం స్వాహా..

- కబ్జాకోరల్లో గ్రామ కంఠం భూమి
- ఏళ్లుగా అనుభవదారులుగా ఉన్న వారికి అన్యాయం
- దౌర్జన్యం చేసి యథేచ్ఛగా శాశ్వత కట్టడాలు
- ఆక్రమణదారులకు అండగా అధికారులు



గ్రామ కంఠాన్ని ఆక్రమించి తీసిన పిల్లర్ గుంతలు



తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరించినట్లుగా సృష్టించిన నకిలీ పత్రాలు

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీ అండదండలతో ఆ పార్టీ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. గ్రామకంఠం భూమిని ఆక్రమించడంతో పాటు అక్కడ ఏళ్ల తరబడి అనుభవదారుగా ఉన్న వారిపై అధికారుల అండతో అక్రమ కేసులు బనాయించారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామంలో సర్వే నంబరు 15లో 9.92 ఎకరాల విస్తీర్ణంలో గ్రామకంఠం భూమి ఉంది. అందులో 51 సెంట్ల భూమిలో గ్రామానికి చెందిన బొట్లగుంట సత్యన్నారాయణ, బొట్లగుంట వెంకట కృష్ణయ్య కుమారులు శ్రీను తిరుపాలు కొన్ని తరాలుగా గేదెలు, ఆవులు, గడ్డివాములు వేసుకుని పశువులను మేపుకుంటూ నివాసం ఉంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ సానుభూతిపరులకు ఆ గ్రామకంఠం పై కన్నుపడింది. కందుకూరు మండలం కోవూరు గ్రామానికి చెందిన కొండూరి వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీను వెంకటకృష్ణాపురం గ్రామంలో సదరు సర్వే నంబరు 15లో 6 సెంట్లు భూమి ని అదే గ్రామానికి చెందిన పాలెపు పద్మ, గణిపినేని కొండయ్యల వద్ద కొనుగోలు చేశాడు. టీడీపీ నేతల అండదండలతో దానికి ఆనుకుని ఉన్న మరో 10 సెంట్లు భూమిని యథేచ్ఛగా ఆక్రమించి రేకుల షెడ్ వేశాడు. ఇంతటితో ఆగకుండా కొండూరి వెంకటేశ్వర్లు తన కుమారుడి పేరుతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సింగరాయకొండ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఏడాది 280 చదరపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశాడు. దీనిపై ఇద్దరూ ఘర్షణపడ్డారు. మా అనుభవంలో ఉన్న భూమిలో ఇళ్లు కట్టుకునేందుకు జేసీబీతో గుంతలు తీస్తుంటే కొంటూరి వెంకటేశ్వర్లు, శ్రీనులు పోలీసుల సహాయంతో నిలిపివేశాడని, దీనిపై కోర్టుకు వెళ్లామని, కోర్టులో కేసు నడుస్తున్నా, ఎలాంటి అనుమతులు లేకుండా టీడీపీ నాయకుల అండదండలతో మా స్థలంలో అక్రమంగా గుంతలు తీస్తూ మా పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని బొట్లగుంట తిరుపాలు, బొట్లగుంట శ్రీనులు వాపోయారు. గ్రామ కంఠం భూమి ప్రభుత్వానిది కాదని, సదరు స్థిరాస్థి ఎండోమెంట్ వారి పరిధిలో లేదని గత ఏడాది అప్పటి తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించినట్లు పత్రాలు సృష్టించడం కొసమెరుపు. వారు కొనుగోలు చేసిన 6 సెంట్ల భూమిలో కాకుండా హద్దులు దాటి మా స్థలాన్ని ఆక్రమిస్తున్నారన్నారని తెలిపారు. దౌర్జన్యంగా మా స్థలంలో గుంతలు తీసి సిమెంట్ పనులు చేపట్టారని, అక్రమ కట్టడాలు కట్టడమే కాక మహిళలను సైతం శనివారం ఇష్టానుసారంగా తిడుతూ, కొట్టబోయారని, ఈ సంఘటన పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు మా వినతులను పక్కన పడేశారని బాధితులు వాపోతున్నారు. ఈ భూ ఆక్రమణకు స్థానిక టీడీపీ నాయకులతో పాటు, అధికారుల అండదండలు ఉన్నట్లు సమాచారం. విచారించి తగు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

పోలిరెడ్డికి భారత్ విద్యా విభూషణ్ అవార్డు

గిద్దలూరు రూరల్: స్థానిక ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పోలిరెడ్డికి ఇంటర్నేషనల్ అమెరికన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ వారు భారత్ విద్యా విభూషణ్ అవార్డు అందజేశారు. ఈ అవార్డును చెన్నైలో ఈనెల 12న సంస్థ జాయింట్ డైరెక్టర్ సి.కృష్ణ చేతుల మీదుగా డా.పోలిరెడ్డి అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ సూరం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆంగ్ల సాహిత్య పరిశోధనలో చూపిన విశిష్ట ప్రతిభకు, ఉన్నత విద్య ఆధ్యాత్మిక రంగాల్లో చేస్తున్న విశేష కృషిని గుర్తించిన సంస్థ ఈ అవార్డును అందజేసింది. గతంలోను పోలిరెడ్డి పలు అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డితో పాటుగా అధ్యాపక బృందం ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డు గ్రహీత డా.పోలిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

కోలాహలంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ

- గోవింద నామస్మరణతో మార్మోగిన శ్రీగిరి మాడ వీధులు



గిరి ప్రదక్షిణలో కోలాటం ప్రదర్శిస్తున్న భజన మండలి మహిళలు

ఒంగోలు మెట్రో: జ్యేష్ఠ మాసం శ్రవణా నక్షత్రం ఆదివారం ఉదయం ఐదు గంటలకు శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కోర్టు సెంటర్ వద్ద బాపూజీ గోశాలలో గోపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో శ్రీవారి ఉత్సవమూర్తిని ఉంచి భక్తులు పల్లకిని మోస్తూ సామూహికంగా గోవింద నామాలు పటిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణలో వాసవి కోలాట భజన మండలి సభ్యులు కోలాటం ప్రదర్శించారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని పతంజలి యోగ మిత్ర మండలి యోగా గురువు గోపాల్ రెడ్డి తమ శిష్య బృందం సేవ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం, కోశాధికారి వలేటి కృష్ణారావు, ధనిశెట్టి రాము నాయుడు, సెనెగేపల్లి నాగాంజనేయులు, యోగా గురువు గోపాల్ రెడ్డి, మురళి, ఈశ్వరయ్య, దేసు కృష్ణ, ఆంజనేయులు, వాసవి కోలాట భజన మండలి సభ్యులు రేఖ, అరవింద లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

సింగరాయకొండ: యోగాతో ఆరోగ్యం పదిలమని, ప్రతి ఒక్కరూ ప్రతి రోజు యోగా చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర మంత్రి స్వామి అన్నారు. పాకల బీచ్‌లో ఆదివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెగా యోగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజలు జయప్రదం చేయాలని, ఆ ఒక్కరోజు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందితో యోగా చేయించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని, జిల్లా ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీచ్‌లో సముద్రం ఒడ్డున యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, సీఐ సీహెచ్ హజరత్తయ్య, జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు 'అన్నా' పరామర్శ



తిరుపతిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 11న పొదిలిలో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తల రాళ్లదాడిలో గాయపడిన మార్కాపురం మండలం గజ్జలకొండ పంచాయతీ పరిధిలోని పడమటిపల్లె గ్రామానికి చెందిన నారు తిరుపతిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆదివారం పరామర్శించారు. ర్యాలీపై రాళ్లదాడి చేయడంతో గాయపడటం బాధాకరమని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, చెంచిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ఒంగోలు టౌన్: ప్రతి నెలా క్రమం తప్పకుండా 104 సిబ్బందికి వేతనాలు చెల్లించాలని 104 ఎంఎం యూ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకున్న భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులు, సిబ్బంది పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. గత రెండు నెలలుగా వేతనాలు రాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని బకాయిలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియార్టీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్తగా నియామకాలు చేపట్టాలన్నారు. 2020 జూలైలో జాయినైన ఉద్యోగులకు కూడా స్లాబ్ సిస్టం అమలు చేయాలని కోరారు. ప్రతి నెలా గ్రీవెన్స్ మీటింగులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి



సింగరాయకొండ సీఐ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

సింగరాయకొండ: శాంతి భద్రతలను పకడ్బందీగా పరిరక్షించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసులకు సూచించారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని, ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని, మహిళలను గౌరవించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట చెరువులో పచ్చదొంగలు..!

- మళ్లీ అక్రమంగా తుమ్మచెట్ల నరికివేత
- ప్రతిరోజూ సుమారు రూ.2 లక్షల విలువైన తుమ్మకర్ర రవాణా
- కె.బిట్రగుంట, కలికవాయ పంచాయతీల పరిధిలోని చెరువులో యథేచ్ఛగా అక్రమాలు
- టీడీపీ నేతలే చేస్తున్నారని ఆరోపిస్తున్న రెండు గ్రామాల ప్రజలు
- చోద్యం చూస్తున్న పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు

ఒంగోలు, సాక్షి నెట్‌వర్క్: జాతీయ రహదారికి కూతవేటు దూరంలో జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట, సింగరాయకొండ మండలం కలికవాయ గ్రామాల పరిధిలో ఉన్న బిట్రగుంట చెరువులో మరోసారి పచ్చ పార్టీ దొంగలు బరితెగించారు. తెలుగు తమ్ముళ్ల అండదండలతో ఆరు రోజులుగా అక్రమార్కులు యథేచ్ఛగా తుమ్మచెట్లు నరికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెండు గ్రామాల పంచాయతీ అధికారులు, ఇరిగేషన్, పోలీసు, అటవీశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

చెరువులో రూ.60 లక్షల విలువైన తుమ్మచెట్లు...

కలికవాయ, బిట్రగుంట గ్రామాల పరిధిలో ఉన్న అతి పెద్ద కె.బిట్రగుంట చెరువులో దాదాపు 10 సంవత్సరాలుగా తుమ్మచెట్లు కొట్టకపోవటంతో సుమారు 60 లక్షల రూపాయల విలువైన కలప ఉంది. ఈ చెట్లకు గ్రామ పంచాయతీ, ఫారెస్టు, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించాలి. పాట దక్కించుకున్న మాత్రమే చెట్లు కొట్టుకోవాలి. కానీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగకుండా కూటమి నాయకుల అండదండలతో నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన వ్యక్తి తుమ్మ



కె.బిట్రగుంట చెరువులో నరికివేసిన తుమ్మచెట్లు

చెట్లను నరికివేసి కలప తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ఆరురోజులుగా ప్రతిరోజూ సుమారు 2 లక్షల రూపాయల విలువగల కర్ర కొట్టుకుని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని చెబుతున్నారు.

భారీగా చీకటి ఒప్పందాలు...

బిట్రగుంట చెరువులో చెట్లు కొట్టుకునేందుకు కందుకూరుకు చెందిన వ్యక్తితో సుమారు 17 లక్షల రూపాయలకు తెలుగు తమ్ముళ్లు చీకటి ఒప్పందం కుదుర్చుకుని అధికారాన్ని అడ్డం పెట్టుకుని అండగా నిలుస్తున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులో చెట్ల నరికివేతపై రెండు గ్రామాల ప్రజలు ఇరిగేషన్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, చెట్ల నరికివేత విషయం తమకు తెలియదని, వెంటనే పరిశీలించి వాస్తవమైతే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నప్పటికీ.. అక్రమార్కులతో కుమ్మక్కయ్యారనే అనుమానాలున్నట్లు రైతులు తెలిపారు. ఇటీవల చెరువులను కాపాడేందుకు నియమించిన సాగునీటి సంఘాల అధ్యక్షులు కూడా అక్రమంగా చెట్లు నరికివేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవటంపై రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమంగా చెట్ల నరికివేతకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని లక్షలాది రూపాయల విలువ గల తుమ్మచెట్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

గత సంవత్సరం చెట్ల నరికివేతను అడ్డుకున్న రైతులు...

గత సంవత్సరం ఆగస్టులో తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా సుమారు 10 లక్షల రూపాయల విలువ గల తుమ్మచెట్లను నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఇరిగేషన్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు చెరువును పరిశీలించి అక్రమంగా చెట్ల నరికివేత జరిగినట్లు నిర్ధారించుకుని సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెరువులో అక్రమంగా తుమ్మచెట్లు నరికే వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అప్పటి నుంచి అక్రమంగా చెట్ల నరికివేత నిలిచిపోయింది. కానీ, ఇప్పుడు మళ్లీ అక్రమంగా చెట్లు నరకటంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న తుమ్మకర్ర



ట్రాక్టర్‌లో తరలిస్తున్న తుమ్మకర్ర



కలికవాయ చెరువు వద్ద ట్రాక్టర్‌లో తరలించేందుకు సిద్ధంగా ఉన్న తుమ్మ చెట్ల మొద్దులు

ఘోర రోడ్డు ప్రమాదం



సంఘటన స్థలంలో సహాయక చర్యల్లో పోలీసులు, స్థానికులు



యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మృతిచెందిన ఐషర్ వాహన డ్రైవర్ కుమారస్వామి



వాహనంలో ఇరుక్కుని ఉన్న కుమారస్వామి మృతదేహం

- టైరు పగిలి అదుపుతప్పిన మామిడికాయల లోడు వాహనం
- కూలీలు వెళ్తున్న వాహనాన్ని ఢీ
- ఒకరు మృతి, 28 మందికి గాయాలు
- క్షతగాత్రులంతా కూలీలు
- యర్రగొండపాలెం మండలం అనకుంట సమీపంలో ఘటన

యర్రగొండపాలెం: మండలంలోని అనకుంట సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో 28 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. మిగిలిన వారంతా యర్రగొండపాలెంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. యర్రగొండపాలెం మండలంలోని చెన్నరాయునిపల్లెకు చెందిన కూలీలు బొప్పాయి కోతల కోసం ఐషర్ వాహనంలో మార్కాపురం వైపు వెళ్తున్నారు. అనకుంట వద్దకు రాగానే.. తిరుపతి నుంచి పల్నాడు జిల్లా గురజాలకు మామిడికాయల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం టైరు పగిలింది. ఈ వాహనం అదుపుతప్పి ఎదురుగా కూలీలతో వస్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని చర్లతిరుమలాపూర్‌కు చెందిన ఐషర్ వాహన డ్రైవర్ శీల కుమారస్వామి (42) వాహనంలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. అదే రాష్ట్రంలోని మిర్యాలగూడెంకు చెందిన బొలేరో వాహన డ్రైవర్ సందీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఐషర్ వాహనంలో వెళ్తున్న కూలీలు కె.రత్తాలు, ఎం.తిమ్మయ్య, ఆర్.మల్లేశ్వరి, ఎం.చెన్నమ్మ, బి.అనిల్, ఎం.రవణమ్మ, కె.చెన్నమ్మ, పి.వెలుగొండ, పి.రాజు, కె.చిన్నలత, ఎస్.పెద్దమల్లయ్య, ఎం.బ్రహ్మయ్య, ఎం.ఏసుబాబు, కె.అభిలాష్, ఎం.దీప్తి, వి.వెంకటనారాయణ, డి.రమేష్‌నాయక్, ఎం.లింగయ్య, కె.చెన్నయ్య, కె.వరలక్ష్మి, కె.చెన్నకేశవులు, ఎన్.ఆదిలక్ష్మమ్మ, ఎస్.వెంకటరమణ, ఎం.శ్రీను, కె.చెన్నయ్య, బి.ఎల్లయ్య, షేక్.సైదాలకు గాయాలయ్యాయి.

బొలేరో వాహన డ్రైవర్ సందీప్ పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. యర్రగొండపాలెం ఎస్సై పి.చౌడయ్య ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తోకపల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతిచెందిన వ్యక్తి

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లి గ్రామంలో బస్టాండ్ దగ్గర ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. బస్టాండ్ సమీపంలో ఉన్న బంకు వద్ద నిద్రిస్తున్నట్లుగా ఉన్న వ్యక్తి దగ్గరకు స్థానికులు వెళ్లి నిద్రలేపేందుకు ప్రయత్నించారు. అతను చనిపోయినట్లు గమనించి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5 అడుగుల 3 అంగుళాలు ఉంటాడని, నీలిరంగు ప్యాంటు, పచ్చ, నలుపు గళ్ల చొక్కా వేసుకుని ఉన్నట్లు పెద్దారవీడు ఎస్ఐ పి.అనిల్‌కుమార్ వివరించారు. మృతదేహాన్ని గుర్తించేందుకు 9121102186 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఒంగోలు టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు స్కీం వర్కర్లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్నారనే సాకుతో స్కీం వర్కర్లు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. అతి తక్కువ వేతనాలు తీసుకుంటున్న ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాల్లో కోత పెట్టడం దుర్మార్గమని చెప్పారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఆదాయ పరిమితి పెంచాలన్నారు. గత ఆరేళ్ల ఆదాయ పరిమితిని నేటికీ కొనసాగించడం సమంజసం కాదన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక నష్టపోతున్నారని చెప్పారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా రెగ్యులర్ కాని ఉద్యోగులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని, కార్మిక వర్గాన్ని దోచుకోవడానికి వీలు కల్పిస్తూ పని గంటలు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన భద్రత కల్పించకుండా మహిళలచే నైట్ షిఫ్ట్ పనులు చేయించడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ స్కీం కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులను చేయడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి, పి.కల్పన, జీ శ్రీనివాసరావు, టి.రంగారావు, పి.ఆంజనేయులు, ఆవులయ్య, పారా శ్రీనివాసులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకుని..

మధుర స్మృతులు నెమరువేసుకుని...

- జిల్లాలో నాలుగు చోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- చిన్ననాటి జ్ఞాపకాలతో ఆనందంగా గడిపిన పెద్దలు

గిద్దలూరు రూరల్: పాఠశాల, కళాశాల నాటి రోజులను తలచుకుని మైమరచిపోని వారంటూ ఉండరంటే అతిశయోక్తి కాదు. అలాంటిది.. ఆనాడు కలిసి చదువుకున్న వారంతా ఎన్నో ఏళ్ల తర్వాత ఒకచోట కలిస్తే ఆ ఆనందానికి హద్దే ఉండదు. ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారంతా తమ చిన్ననాటి మధుర స్మృతులు, ఆనాడు చేసిన అల్లర్లను నెమరువేసుకోవడంతో పాటు ప్రస్తుతం వారి పరిస్థితులు, ఇన్నేళ్ల జీవితంలో వారికి ఎదురైన అనుభవాలు పంచుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

55 ఏళ్ల తర్వాత కలుసుకున్న 1970-72 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు...



గిద్దలూరులో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు పట్టణంలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 1970-72 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 55 సంవత్సరాల తర్వాత సుమారు 72 సంవత్సరాలు పైబడిన 49 మంది వృద్ధులు ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థి, విశ్రాంత అధ్యాపకుడు సూరం నారాయణరెడ్డి మాట్లాడుతూ తమ బ్యాచ్‌కి విద్య బోధించిన గురువులలో లంకా సత్యనారాయణ, వీరభద్రయ్య మాత్రమే జీవించి ఉన్నారని తెలిపారు. మిగిలిన వారంతా కాలంచేశారని చెప్పారు. తమకు విద్య బోధించిన గురువులను గుర్తుచేసుకుని స్నేహితులంతా కలిసి ఆనందంగా గడిపారు. వీరి బ్యాచ్‌లో పది మందికిపైగా డాక్టరేట్ పొందిన వారున్నారు. తమతో పాటు చదువుకున్న వారిలో 30 మంది మరణించడంతో వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ అసిస్టెంట్ ఏజీఎం వామనరావు, నాగార్జున యూనివర్సిటీ బోటనీ రిటైర్డ్ హెడ్‌డీ విష్ణువర్ధన్, తుమ్మలపెంట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల తర్వాత కలుసుకున్న పదో తరగతి విద్యార్థులు...



చీమకుర్తిలో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఇప్పటి వరకు నిర్వహించిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్య నేర్పించిన గురువులను సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థిలో ఒకరైన ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, గొల్లపూడి వెంకట్రావును, ట్యూషన్ చెప్పిన టీచర్లను సత్కరించారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. వివిధ స్థాయిల్లో ఉన్న వారంతా కలిసి కుశల ప్రశ్నలు వేసుకుని ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు.

తర్లుపాడులో 32 ఏళ్ల తర్వాత...



తర్లుపాడులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 32 సంవత్సరాల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠశాల మొత్తం కలియ తిరిగారు. తమకు విద్య నేర్పి జీవిత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దిన గురువులు జె.గోపాలకృష్ణమూర్తి, ఎస్‌సీ కృష్ణారెడ్డి, కె.అనివిలాసిని, ముసలయ్యలను ఘనంగా సత్కరించారు. కీర్తిశేషులైన గురువుల కుటుంబ సభ్యులను సత్కరించారు. ప్రతి సంవత్సరం ఇక్కడే కలుద్దామని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, స్కూల్ చైర్మన్ రాజారామిరెడ్డి, ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసులు, సీహెచ్ చెంచయ్య, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలను అభివృద్ధి చేసిన హెచ్ఎం సుధాకర్‌ను పూర్వ విద్యార్థులు అభినందించారు.

బేస్తవారిపేటలో డిగ్రీ బ్యాచ్ విద్యార్థులు...



కళాశాల కరస్పాండెంట్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక కందుల ఓబులరెడ్డి డిగ్రీ కళాశాలలో 1996-1999లో డిగ్రీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 29 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. తమకు చదువు చెప్పిన గురువులైన కరస్పాండెంట్ కందుల ఓబులరెడ్డి, అధ్యాపకులు సోమశేఖర్, శ్రీనివాసులు, శంకర్, చేగిరెడ్డి సుబ్బారెడ్డిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఒంగోలు రైల్వేస్టేషన్ వద్ద దొంగ అరెస్టు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చోరీలు చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న ఒక దొంగను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా అరిసెపల్లి మండలం హుసేన్‌పాలెం గ్రామానికి చెందిన పెదపూడి గోపయ్య కొన్ని సంవత్సరాలుగా అనేక దొంగతనాలు చేస్తున్నాడు. ఇప్పటికే అతడి మీద వివిధ పోలీసు స్టేషన్లలో 13 కేసులు నమోదై ఉన్నాయి. అతడిపై నిఘా ఉంచిన జీఆర్పీ పోలీసులు శనివారం సాయంత్రం ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలోని కొత్తపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.